# అన్నమయ్య పాటలు

సంకలనం
శిరోమణి సముద్రాల లక్ష్మణయ్య, ఎం.ఎ.,
కార్యదర్శి
ధర్మప్రచార పరిషత్, టి.టి.డి.,
తిరుపతి.



ప్రచురణ
ధర్మప్రచార పరిషత్,
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.
1997

# అన్నమయ్య పాటలు

సంకలనం:
శిరోమణి
సముద్రాల లక్ష్మణయ్య, ఎం.ఎ.,
కార్యదర్శి,
ధర్మప్రచారపరిషత్, టి.టి.డి.,
తిరుపతి.

ప్రచురణ:

ధర్మప్రచార పరిషత్,
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.
1998

# అన్నమయ్య పాటలు

సంకలనం:
సముద్రాల లక్ష్మణయ్య,
కార్యదర్శి, ధర్మప్రచారపరిషత్,
తి.తి.దే., తిరుపతి.

ప్రచురణ కర్త:
శ్రీ యమ్.కె.ఆర్. వినాయక్, I.A.S.,
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

ముద్రణ:
తి.తి. దేవస్థానముద్రణాలయం,
తిరుపతి.

# నివేదన

'భక్తి నీ పై దొకటె పరమ సుఖము' అని అన్నమయ్య సూక్తి. ముప్పది రెండువేల సంకీర్తన కుసుమాలతో శ్రీవేంకటేశ్వర స్వామిని అర్చించిన పదకవితా పితామహుడు అన్నమయ్య. ఆయన వేదాలనే సంకీర్తనలుగా రూపొందించాడు. అందులోనూ ప్రపత్తి రూపమైన భక్తితో సులభంగా శ్రీనివాసుని అనుగ్రహం పొందవచ్చు అని నిరూపించాడు.

తిరుమల తిరుపతి దేవస్థానంవారు అన్నమయ్య సంకీర్తనలను విరివిగా ప్రచారంచేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. అన్నమాచార్య ప్రాజెక్టు తరపున 'సప్తగిరి సంకీర్తనలు' అన్న పేరుతో ఏడు పాటలను ముద్రించడం జరిగింది. అలాగే భజన బృందాల వినియోగానికై ధర్మ ప్రచార పరిషత్తు ద్వారా 'అన్నమయ్య పాటలు' అన్న పేరుతో పదునైదుపాటల సంపుటమొకటి పూర్వం ముద్రించబడింది.

1-9-97వ తేదీన సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ డి. రామకృష్ణ I.A.S. గారి అధ్యక్షతన దేవస్థానం పరిపాలనా కార్యాలయములో జరిగిన ప్రాజెక్టు అధికారుల సమావేశంలో పై రెండు ప్రచురణలలోని పాటలతో మరికొన్ని పాటలు కలిపి ఇరువది అయిదు పాటలను ఒక చిరు సంపుటంగా విద్యాలయాలలో ఉచితంగా సరఫరా చేయడానికై ప్రచురించాలన్న నిర్ణయం జరిగింది.

ఆ నిర్ణయం మేరకు ఇరువది అయిదు పాటలతో కూడిన ఈ సంపుటం ధర్మప్రచారపరిషత్తు ద్వారా ముద్రించబడింది. విద్యాసంస్థలు ఈ ప్రచురణను శ్రద్ధతో స్వీకరించి విద్యార్థులలో భక్తి భావం పెంపొందించడానికి సహకరించగలరని ఆశిస్తున్నాము.

సముద్రాల లక్ష్మణయ్య
కార్యదర్శి
ధర్మ ప్రచార పరిషత్
తిరుమల తిరుపతి దేవస్థానములు.



# అన్నమయ్య పాటలు

అదివో అల్లదివో - హరివాసము
పదివేలు శేషుల - పడగల మయము. ॥ అది ॥

అదె వేంకటాచల - మఖిలోన్నతము
అదివో బ్రహ్మాదుల - కపురూపము
అదివో నిత్యనివాస - మఖిల మునులకు
అదె చూడుఁడదె మ్రొక్కు - డానందమయము ॥ అది ॥

చెంగట నల్లదివో - శేషాచలము
నింగినున్న దేవతల - నిజవాసము
ముంగిట నల్లదివో - మూలనున్న ధనము .
బంగారు శిఖరాల - బహు బ్రహ్మమయము ॥ అది ॥

కైవల్యపదము వేం - కటనగ మదివో
శ్రీవేంకటపతికి - సిరులైనది
భావింప సకల సం - పదరూప మదివో
పావనముల కెల్ల - పావన మయము ॥ అది ॥

* * *

నారాయణ తే - నమో నమో
నారదసన్నుత - నమో నమో ॥ నారా ॥

మురహర భవహర - ముకుంద మాధవ
గరుడగమన పం - కజనాభ
పరమపురుష భవ - బంధ విమోచన
నరమృగశరీర - నమో నమో ॥ నారా ॥

జలధిశయన రవి - చంద్ర విలోచన
జలరుహభవనుత - చరణయుగ
బలిబంధన గో - పవధూ వల్లభ
నలినోదర తే - నమో నమో ॥ నారా ॥

ఆదిదేవ సక - లాగమ పూజిత
యాదవకుల మో - హన రూప
వేదోద్ధర శ్రీ - వేంకటనాయక
నాదప్రియ తే - నమో నమో ॥ నారా ॥

* * *

కొండలలో నెలకొన్న - కోనేటిరాయఁడు వాఁడు
కొండలంత వరములు - గుప్పెడు వాఁడు ॥ కొండ ॥

కుమ్మర దాసుడైన - కురువరతినంబి
యిమ్మన్న వరములెల్ల - నిచ్చిన వాఁడు
దొమ్ములు చేసినయట్టి - తొండమాంజక్కురవర్తి
రమ్మన్న చోటికి వచ్చి - నమ్మినవాఁడు ॥ కొండ ॥

అచ్చపు వేడుకతోడ న - నంతాళువారికి
ముచ్చిలి వెట్టికి మన్ను - మోఁచినవాఁడు ॥ కొండ ॥

మచ్చిక దొలఁకఁ దిరు - మల నంబితోడుత
నిచ్చ నిచ్చ మాటలాడి - నచ్చినవాఁడు ॥ కొండ ॥

కంచిలోన నుండఁ దిరు - కచ్చి నంబిమీఁదఁ గరు
ణించి తన యెడకు ర - ప్పించిన వాఁడు
యెంచ నెక్కుడైన వేంక - టేశుఁడు మనలకు
మంచివాఁడై కరుణఁబా - లించినవాఁడు ॥ కొండ ॥

* * *

నానాఁటి బదుకు - నాటకము
కానక కన్నది - కైవల్యము. । నానా ।

పుట్టుటయు నిజము - పోవుటయు నిజము
నట్టనడిమిపని - నాటకము
యెట్ట నెదుటఁగల - దీ ప్రపంచము
కట్టఁ గడపటిది - కైవల్యము । నానా ।

కుడిచే దన్నము - కోక చుట్టెడిది
నడుమంత్రపుపని - నాటకము
వొడి గట్టుకొనిన - వుభయకర్మములు
గడి దాఁటినపుడే - కైవల్యము । నానా ।

తెగదు పాపము - తీరదు పుణ్యము
నగి నగి కాలము - నాటకము
యెగువనె శ్రీ వేంక - టేశ్వరుఁ డేలిక
గగనము మీఁదిది - కైవల్యము । నానా ।

* * *

## 5

భావములోనా - బాహ్యమునందును
గోవింద గోవింద యని - కొలువవో మనసా! । భావ ।

హరి యవతారములే - యఖిలదేవతలు
హరిలోనివే బ్ర - హ్మాండంబులు
హరి నామములే - అన్ని మంత్రములు
హరి హరి హరి హరి - యనవో మనసా! । భావ ।

విష్ణుని మహిమలే - విహిత కర్మములు
విష్ణుని పొగడెడి - వేదంబులు
విష్ణుఁ డొక్కడే - విశ్వాంతరాత్ముఁడు
విష్ణువు విష్ణువని - వెదకవో మనసా! । భావ ।

అచ్యుతుఁ డితఁడే - ఆదియు నంత్యము
అచ్యుతుఁడే యసు - రాంతకుఁడు
అచ్యుతుఁడు శ్రీ వేంక - టాద్రి మీఁద నిదె
అచ్యుత అచ్యుత శర - ణనవో మనసా । భావ ।

* * *

ముద్దుగారే యశోద - ముంగిటి ముత్యము వీఁడు
తిద్దరాని మహిమల - దేవకీ సుతుఁడు ॥ ముద్దు ॥

అంత వింత గొల్లెతల - అరచేతి మాణికము
పంతమాడే కంసుని - పాలి వజ్రము
కాంతుల మూడు లోకాల - గరుడ పచ్చఁబూస
చెంతల మాలో నున్న - చిన్ని కృష్ణుఁడు ॥ ముద్దు ॥

రతికేళి రుక్మిణికి - రంగుమోవి పగడము
మితి గోవర్ధనపు గో - మేధికము
సతమై శంఖచక్రాల - సందుల వైడూర్యము
గతియై మమ్ముఁ గాచేటి - కమలాక్షుఁడు ॥ ముద్దు ॥

కాళింగుని తలలపైఁ - గప్పిన పుష్యరాగము
యేలేటి శ్రీవేంకటాద్రి - యింద్రనీలము
పాలజలనిధి లోనఁ - బాయని దివ్యరత్నము
బాలునివలెఁదిరిగీఁ - బద్మనాభుఁడు. ॥ ముద్దు ॥

* * *

పందెకాడఁ బుట్టినట్టి - చాయలపంట యెంత
చందమాయఁ జూడరమ్మ - చందమామ పంట ॥ పందె ॥

మమపఁ బాలవెల్లి - మొలచి పండిన పంట
వినుపై దేవతలకు - విచ్చ పంట
గొవకొని హరి కన్ను - గొవచూపుల పంట
వినువీథి వెగడిన - వెన్నెలల పంట ॥ పందె ॥

వలరాజు పంపున - వలపు విత్తిన పంట
చలువై పున్నమనాటి - జాజరపంట
కలిమికామిని తోడ - కారుకమ్మిన పంట
మలయుచుఁ దమలోని - మ్రరిమాని పంట ॥ పందె ॥

విరహుల గుండెలకు - వెక్కసమైన పంట
పరగ చుక్కలరాసి - భాగ్యము పంట
అరుదై తూరుపుఁగొండ - వారగఁ బండిన పంట
యిరవై శ్రీవేంకటేశు - నింటిలోని పంట ॥ పందె ॥

* * *

## 8

దేవదేవం భజే - దివ్య ప్రభావం
రావణాసురవైరి - రఘుపుంగవం ॥ దేవ ॥

రాజవరశేఖరం - రవికులసుధాకరం
ఆజానుబాహునీ - లాభ్రకాయం
రాజారి కోదండ - రాజ దీక్షాగురుం
రాజీవలోచనం - రామచంద్రం ॥ దేవ ॥

నీలజీమూత స - న్నిభ శరీరం ఘనవి
శాలవక్షం విమల - జలజనాభం
తాలాహి నగహరం - ధర్మసంస్థాపనం
భూలలనాధిపం - భోగిశయనం ॥ దేవ ॥

పంకజాసన వినుత - పరమనారాయణం
శంకరార్జిత జనక - చాపదళనం
లంకా విశోషణం - లాలిత విభీషణం
వేంకటేశం సాధు - విబుధ వినుతం ॥ దేవ ॥

* * *

9

విన్నపాలు వినవలె - వింత వింతలు
పన్నగపు దోమతెర - పైకెత్త వేలయ్యా! ॥ విన్న ॥

తెల్లవారె జామెక్కె - దేవతలు మునులు
అల్లవల్ల నంత నింత - నదిగో వారే
చల్లని తమ్మి రేకుల - సారసపుఁ గన్నులు
మెల్లమెల్లనె విచ్చి - మేలుకొన వేలయ్యా! ॥ విన్న ॥

గరుడ కిన్నర యక్ష - కామినులు గములై
విరహపు గీతముల - వింతాలాపాల
పరిపరి విధములఁ బాడేరు విన్నదివో
సిరిమొగము దెరచి - చిత్తగించ వేలయ్యా! ॥ విన్న ॥

పొంకపు శేషాదులు తుం - బురు నారదాదులు
పంకజ భవాదులు నీ - పాదాలు చేరి
అంకెల నున్నారు లేచి - అలమేలుమంగను
వేంకటేశుఁడా రెప్పలు - విప్పి చూచి లేవయ్యా! ॥ విన్న ॥

* * *

ఏ కులజుఁ డేమి - యెవ్వడైన నేమి
ఆకడ వాతఁడె - హరి నెరిఁగినవాఁడు ॥ ఏకు ॥

పరగిన సత్య సం - పన్నుఁడైన వాఁడే
పరనింద సేయఁద - త్పరుఁడు గానివాఁడు
అరుదైన భూత ద - యానిధి యగువాఁడే
పరులు దానే యని - భావించువాఁడు ॥ ఏకు ॥

నిర్మలుఁడై యాత్మ - నియతి గలుగువాఁడే
ధర్మతత్పరత బుద్ధిఁ - దగిలినవాఁడు
కర్మమార్గములు - గడవని వాఁడే
మర్మమై హరిభక్తి - మరవనివాఁడు ॥ ఏకు ॥

జగతిపై హితముగా - జరియించువాఁడే
పగలేక మతిలోన - బ్రదికినవాఁడు
తెగి సకలము నాత్మఁ - దెలిసినవాఁడే
తగిలి వేంకటేశు - దాసుఁ డయినవాఁడు ॥ ఏకు ॥

* * *

చేరి యశోదకు - శిశు వితఁడు
ధారుణి బ్రహ్మకుఁ - దండ్రియు నితఁడు ॥ చేరి ॥

సొలసి చూచినను - సూర్యచంద్రులను
లలి వెదచల్లెడు - లక్షణుఁడు
నిలిచిన నిలువున - నిఖిలదేవతల
కలిగించు సురల - గనివో యితఁడు ॥ చేరి ॥

మాటలాడినను - మరి యజాండములు
కోటులు వొడమేటి - గుణరాశి
నీటగు నూర్పుల - నిఖిల వేదములు
చాటువ నూరేటి - సముద్ర మితఁడు ॥ చేరి ॥

ముంగిటఁ బొలసిన - మోహన మాత్మలఁ
బొంగించే ఘన - పురుషుఁడు
సంగతి మావంటి - శరణాగతులకు
నంగము శ్రీ వేంక - టాధిపుఁ డితఁడు ॥ చేరి ॥

* * *

పొడగంటి మయ్య మిమ్ము - పురుషోత్తమా ! మమ్ము
వెడయకవయ్య కో - నేటి రాయఁడా ! ॥ పొడ ॥

కోరి మమ్ము నేలినట్టి - కులదైవమా ! చాల
నేరిచి పెద్దలిచ్చిన - నిధానమా !
గారవించి దప్పిదీర్చు - కాలమేఘమా ! మాకు
చేరువఁ జిత్తములోని - శ్రీనివాసుఁడా ! ॥ పొడ ॥

భావింప గైవసమైన - పారిజాతమా ! మమ్ము
చేవదేరఁ గాచినట్టి - చింతామణీ !
కావించి కోరిక లిచ్చే - కామధేనువా ! మమ్ము
తావై రక్షించేటి - ధరణీధరా ! ॥ పొడ ॥

చెడనీక బ్రదికించే - సిద్ధమంత్రమా ! రోగా
లడఁచి రక్షించే ది - వ్యౌషధమా !
బడిఁ బాయక తిరిగే - ప్రాణబంధుఁడా ! మమ్ము
గడియించినట్టి శ్రీ వేం - కటనాథుడా ! ॥ పొడ ॥

* * *

అలరులు గురియఁగ - వాడె వదే
అలకలఁ గులుకుల - నలమేలు మంగ ॥ అల ॥

అరవిరి సొబగుల - నతివలు మెచ్చఁగ
అరతెర మరుగున - వాడెవదే
వరుసగ పూర్వ దు - వాళపు తిరుపుల
హరిఁ గరగింపుచు - నలమేలు మంగ ॥ అల ॥

మట్టపు మలపుల - మట్టెల కెలకుల
తట్టెడి నడపుల - దాటెవదే
పెట్టిన వజ్రపు - పెండెపు దళుకులు
అట్టిటు చిమ్ముచు - నలమేలు మంగ ॥ అల ॥

చిందుల పాటల - శిరిపొలయాటల
అందెల మ్రోతల - వాడె వదే
కందువ తిరు వేం - కటపతి మెచ్చఁగ
అందపు తిరుపుల - నలమేలు మంగ ॥ అల ॥

* * *

14

చక్కని తల్లికి - చాంగుభళా తన
చక్కెర మోవికి - చాంగుభళా ! ॥ చక్క ॥

కులికెటి మురిపెపు - కుమ్మరింపు తన
పలుపుఁ జూపులకు - చాంగుభళా !
పలుకుల సొలపులఁ - బతితోఁ గసరెడి
చలముల యలుకకు - చాంగుభళా ! ॥ చక్క ॥

కిన్నెరతో పతి - కెలన విలుచు తన
చన్ను మెరుఁగులకు - చాంగుభళా !
ఉన్నతిఁ బతిపై - వొరగి విలుచు తన
పన్నపు వడిమికి - చాంగుభళా ! ॥ చక్క ॥

జందెపు ముత్యపు - పరుల హారముల
చందన గంధికి - చాంగుభళా !
విందయి వేంకట - విభుఁ బెనఁచిన తన
సంది దండలకు - చాంగుభళా !! ॥ చక్క ॥

* * *

కట్టెదుర వైకుంఠము - కాణాచయినకొండ
తెట్టెలాయ మహిమలే - తిరుమలకొండ ॥ పల్లవి ॥

వేదములే శిలలై - వెలసినది కొండ
యేదెసఁ బుణ్యరాసులే - యేరులైనది కొండ
గాదిలి బ్రహ్మాది లో - కముల కొనలకొండ
శ్రీదేవుఁడుండేటి - శేషాద్రి యీకొండ । కట్టె ।

సర్వదేవతలు మృగ - జాతులై చరించేకొండ
నిర్వహించి జలధులే - నిట్టచరులైనకొండ
ఉర్విఁ దపసులే తరు - వులై నిలిచినకొండ
పూర్వపుటంజనాద్రి యీ - పొడవాటికొండ । కట్టె ।

వరములు కొటారుగా - వక్కణించి పెంచేకొండ
పరగు లక్ష్మీకాంతు సో - బనపుఁ గొండ
కురిసి సంపదలెల్ల - గుహల నిండిన కొండ
విరివైన దిదివో శ్రీ - వేంకటపుఁ గొండ । కట్టె ।

* * *

బ్రహ్మ కడిగిన - పాదము
బ్రహ్మము తానె నీ - పాదము। ।బ్రహ్మ।

చెలగి వసుధ గొలి - చిన నీ పాదము
బలితల మోపిన - పాదము
తలఁకక గగనము - తన్నిన పాదము
బలరిపుఁ గాచిన - పాదము ।బ్రహ్మ।

కామిని పాపము - కడిగిన పాదము
పాము తలనిడిన - పాదము
ప్రేమపు శ్రీసతి - పిసికెడి పాదము
పామిడి తురగపు - పాదము। ।బ్రహ్మ।

పరమ యోగులకు - పరిపరి విధముల
పరమొసగెడి నీ - పాదము
తిరువేంకటగిరి - తిరమని చూపిన
పరమపదము నీ - పాదము। ।బ్రహ్మ।

* * *

ఇందరికి నభయంబు - లిచ్చుచేయి
కందువగు మంచి బం - గారుచేయి ॥ ॥ పల్లవి ॥

వెలలేని వేదములు - వెదకి తెచ్చినచేయి
విలుకు గుబ్బలికిందఁ - జేర్చుచేయి
కలికి యగు భూకాంతఁ - గాఁగిలించిన చేయి
వలనైన కొనగోళ్ల - వాడిచేయి ॥ ఇంద ॥

తనివోక బలిచేత - దాన మడిగినచేయి
ఒనరంగ భూదాన - మొసగుచేయి
మొనసి జలనిధి యమ్ము - మొనకుఁదెచ్చినచేయి
యెనయ నాగేలు ధరి - యించు చేయి ॥ ఇంద ॥

పురసతుల మానములు - పొల్లసేసినచేయి
తురగంబుఁ బరపెడి - దొడ్డచేయి
తిరువేంకటాచలా - ధీశుఁడై మోక్షంబు
తెరువు ప్రాణులకెల్ల - దెలిపెడిచేయి ॥ ఇంద ॥

* * *

ఎవ్వరెవ్వరివాడొ - యీ జీవుఁడు చూడ
వెవ్వరికి వేమౌనొ - యీ జీవుఁడు ॥ పల్లవి ॥

ఎందరికిఁ గొడుకుగా - డీజీవుఁడు వెనక
కెందరికిఁదోఁబుట్టఁ- డీ జీవుఁడు
ఎందరిని భ్రమయించఁ - డీ జీవుఁడు దుఃఖ
మెందరికిఁ గావింపఁ - డీ జీవుఁడు ॥ ఎవ్వ ॥

ఎక్కడెక్కడఁ దిరుగఁ - డీజీవుదు వెనక
కెక్కడో తన జన్మ - మీజీవుఁడు
ఎక్కడి చుట్టము తనకు - నీజీవుడుఁ ఎవ్వ
డెక్కడికి నేగునో - యీజీవుఁడు ॥ ఎవ్వ ॥

ఎన్నఁడును జేటు లే - నీ జీవుఁడు వెనక
కెన్ని తనువులు మోవఁ - డీ జీవుఁడు
ఎన్నగల తిరువేంక - టేశు మాయలఁదగిలి
యెన్ని పదవులఁ బొందఁ- డీ జీవుఁడు ॥ ఎవ్వ ॥

* * *

కడలుడిపి నీరాడఁ- గాఁదలఁచు వారలకు
కడలేని మనసునకుఁ- గడమ యెక్కడిది ॥ పల్లవి ॥

దాహమణఁగిన వెనక - తత్త్వమెరిగెద నన్న
దాహ మేలణఁగు తా - తత్త్వ మేమెరుగు
దేహంబు గలయన్ని - దినములకునుఁబదార్థ
మోహ మేలుడుగు దా - ముదమేల కలుగు ॥ కడ ॥

ముందరెరిగిన వెనక - మొదలు మరచెదనన్న
ముందరేమెరుగుఁదా - మొదలేల మరచు
అందముగఁదిరువేంక - టాద్రీశు మన్ననల
కందువెరిగిన మేలు - కలనైన లేదు ॥ కడ ॥

* * *

సమబుద్ధే యిందరికి - సర్వవేదసారము
సముడిందరికి హరి - సాధనమో యయ్యా !     ॥ పల్లవి ॥

చీమకుందన జన్మము - చేరి సుఖమై తోచు
దోమకుందన జన్మము - దొడ్డసుఖము
ఆమని యీగకు సుఖ - మాజన్మమై తోంచు
ఏమిటా నెక్కువ సుఖ - మెవ్వరి కేదయ్యా!     ॥ సమ ॥

జంతురాసులకు నెల్లా - జననము లొక్కటే
అంతటాను మరణము - లవి యొక్కటే
చెంత నాహార నిద్రలు - స్త్రీసుఖా లొక్కటే
ఇంతటా నిందుకంటే - నెవ్వరేమి గట్టిరయ్యా     ॥ సమ ॥

ఇందులోన నెవ్వరైనా - నేమి శ్రీ వేంకటపతి
నందముగా దలంచిన - దది సుఖము
ఎందు జూచినా నీతం- డిందరిలో నంతరాత్మ
చందముగా నెవ్వరికి - స్వతంత్రమేదయ్యా     ॥ సమ ॥

* * *

దేహి నిత్యుడు - దేహములనిత్యాలు
ఈహల వామనసా - యిది మరవకుమీ ॥ పల్లవి ॥

గుదిఁబాఁత చీరమాని - కొత్తచీరగట్టినట్టు
ముదిమేను మాని దేహి - మొగిఁగొత్తమేను మోచు
అదన జంపఁగలేవు - ఆయుధము లీతని
గదిసి అగ్నియు నీరు - గాలియుఁజంపగలేవు ॥ దేహి ॥

ఈతఁడు నరకువడఁ- డీతఁడగ్నిఁ గాలఁడు
ఈతఁడు నీటమునుఁగఁ- డీతఁడు గాలిఁబోడు
చేతనుఁడై సర్వగతుండౌ - చెలియించఁ డేమిటను
ఈతల నవాది యీతఁ - డిరవు గదలఁడు ॥ దేహి ॥

చేరి కానరానివాఁడు - చింతించరానివాఁడు
భారపు వికారాలఁ - బాసిన వాఁడీయాత్మ
ఆరయ శ్రీవేంకటేశు - నాధీన మీతఁడని
సారము దెలియుటే - సత్యం జ్ఞానము ॥ దేహి ॥

* * *

భారమైన వే(పమాను - పాలువోసి పెంచినాను
తీరని చే(దే కాక - తియ్యనుండీనా ॥ పల్లవి ॥

పాయ(దీసి కుక్కతోక - బద్దలు వెట్టి బిగిసి
చాయకెంతగట్టినాను - చక్కనుండీనా
కాయపు వికారమిది - కలకాలము( జెప్పినా
పోయిన పోకలేకాక - బుద్ధివినీనా ॥ భార ॥

ముంచిముంచి నీటిలోన - మూల నాన( బెట్టుకొన్నా
మించిన గొడ్డలి నే(డు - మెత్తనయ్యీనా
పంచమహాపాతకాల - బారి(బడ్డ చిత్తమిది
దంచిదంచి చెప్పినాను - తా(కి వంగీనా ॥ భార ॥

కూరిమితో( దేలు( దెచ్చి - కోకలోన బెట్టుకొన్నా
సారె సారె( గుట్టుగాక - చక్కనుండీనా
వేరులేని మహిమల - వేంకటవిభునికృప
ఘోరమైనఆస మేలు - కొరసోకీనా ॥ భార ॥

* * *

ఇప్పుడిటు కలగంటి - నెల్లలోకములకు
నప్పుడగు తిరువేంక - టాద్రీశుఁగంటి ॥ పల్లవి ॥

అతిశయంబైన శే - షాద్రి శిఖరముగంటి
ప్రతిలేని గోపుర - ప్రభలుగంటి
శతకోటి సూర్యతే - జములు వెలుగఁగ గంటి
చతురాస్యుఁ బొడగంటి - నయ్యన మేల్కొంటి ॥ ఇప్పు ॥

కనకరత్న కవాట - కాంతులిరుగడఁ గంటి
ఘనమైనదీప సం - ఘములు గంటి
అనుపమ మణిమయ - మ్మగు కిరీటముగంటి
కనకాంబరము గంటి - గ్రక్కున మేల్కొంటి ॥ ఇప్పు ॥

అరుదైన శంఖ చ - క్రాదు లిరుగడఁగంటి
సరిలేని యుభయ హ - స్తము గంటిని
తిరువేంకటాచల - ధిపుని జూడఁగఁగంటి
హరిఁగంటి గురుఁగంటి - నంతట మేల్కొంటి ॥ ఇప్పు ॥

* * *

తనకేడ చదువులు - తనకేడ శాస్త్రాలు
మనసు చంచలబుద్ధి - మానీనా ‖ పల్లవి ‖

జడ్డు మానవుఁడు - చదువఁ జదువ వాస
వడ్డి వారుఁగాక - వదలీనా
గుడ్డికుక్క సంత - కుఁబోయి తిరిగిన
దుడ్డు పెట్టేగాక - దొరకీనా ‖ తన ‖

దేవదూషకుఁడై - తిరిగేటివానికి
దేవతాంతరము - తెలిసీనా?
శ్రీవేంకటేశ్వరు - సేవాపరుఁడుగాక
పావనమతియై - పరగీనా? ‖ తన ‖

* * *

క్షీరాబ్ధి కన్యకకు - శ్రీ మహాలక్ష్మికిని
నీరజాలయమునకు - నీరాజనం ॥ క్షీరా ॥

జలజాక్షి మోమునకు - జక్కవ కుచంబులకు
నెలకొన్న కప్పురపు - నీరాజనం
అలివేణి తురుమునకు - హస్తకమలంబులకు
నిలువు మాణిక్యముల - నీరాజనం ॥ క్షీరా ॥

చరణకిసలయములకు - సకియ రంభోరులకు
నిరతమగు ముత్తేల - నీరాజనం
అరిది జఘనంబునకు - అతివ నిజనాభికిని
నిరతి నానావర్ణ - నీరాజనం ॥ క్షీరా ॥

పగటు శ్రీవేంకటేశు - పట్టపురాణియై
నెగడు సతి కళలకును - నీరాజనం
జగతి నలమేల్మంగ - చక్కఁదనముల కెల్ల
నిగుడు నిజశోభనపు - నీరాజనం ॥ క్షీరా ॥

* * *

శ్రియః కాంతాయ కల్యాణ
నిధయే నిధయేఽర్థినామ్ ।
శ్రీవేంకటనివాసాయ
శ్రీనివాసాయ మంగళమ్ ॥

మంగళాశాసనపరై
ర్మదాచార్య పురోగమైః ।
సర్వైశ్చ పూర్వైరాచార్యై
స్సత్కృతాయాస్తు మంగళమ్ ॥

* * *

ధర్మాన్ని ఆచరించండి-ధర్మమే మిమ్మల్ని కాపాడుతుంది

తిరుమల తిరుపతి దేవస్థానములు
ధర్మ ప్రచార పరిషత్

Printed at T.T.D. Press, Tirupati. C.-50,000. dt. 16-10-97.